క్లుప్తంగా

రూ.50 లక్షల మొండిబకాయిల వసూలు



ఓ షాపింగ్‌మాల్‌లో బకాయిలు వసూలు చేస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొండిబకాయిదారులపై జీవీఎంసీ జోన్–4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు కొరడా ఝులిపించారు. గత ఏడాది బకాయిల తోపాటు ఈఏడాది జీవీఎంసీకి చెల్లించవల్సిన బకాయిలను పూర్తి చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. జోనల్ కమిషనర్ ప్రసాదరావు ,రెవెన్యూ సిబ్బంది, సెక్రెటరీలతో సహా బృందాలుగా ఏర్పాడి జోన్ పరిధిలో ఉన్న 12 వార్డుల్లో బకాయిలు వసూళ్లు చేస్తున్నారు. వాల్తేర్ అప్‌లేన్స్ అపార్టుమెంట్, జిల్లాపరిషత్, ఓ షాపింగ్‌మాల్ బకాయిలను జెడ్సీ వసూలు చేశారు. శనివారం ఒక్క రోజు రూ.50 లక్షల వసూలు చేశారు. ఈసందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజలు వడ్డీలేని పన్నులు చెల్లించాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పందుపుల్లల సందు వద్ద కాలువపై తొలగించిన పలకలు

జగదాంబ: పందుపుల్లల సందు వద్ద ఓ ప్రధాన కాలువ ప్రమాదకరంగా మారింది. కేజీహెచ్, జగదాంబ దరి నుంచి వచ్చే చిన్న కాలువలన్నీ ఈప్రధాన కాలువలోనే కలుస్తాయి. 8 అడుగుల వెడల్పు, 10 అడుగుల లోతు ఉండే ఈకాలువ నుంచి వెళ్లే మురుగు కెనాల్ ద్వారా సముద్రంలో కలుస్తోంది. రోడ్డు విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్ కాలువాపై పలకలు తొలగించి..తిరిగి వేయడం మర్చిపోయాడు. దీంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈప్రాంతంలో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనన్న భయంతో వ్యాపారులు భయందోళన చెందుతున్నారు. ఇప్పటికైన జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే కాలువపై సిమెంట్ పలకలు వేయాలని పలువురు కోరుతున్నారు.

జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ విజేత గాజువాక



ట్రోఫీతో విజేత జట్టు

మహారాణిపేట: విశాఖ జర్నలిస్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఆంధ్రా మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో గాజువాక జట్టు విన్నర్‌గా నిలిచింది.. విశాఖ సిటీ జట్టు రన్నర్‌గా నిలిచింది. ముగింపు వేడుకలకు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్టల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సెమీస్‌కు వాలీబాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్ : డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ మెన్ తొలి సెమీస్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో తూర్పుగోదావరి జిల్లా జట్టు తలపడనుండగా... మరో సెమీస్‌లో ఈకోరైల్వే జట్టుతో కృష్ణాజిల్లా జట్టు తలపడనుంది. రైల్వే గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 26-24,25-18తో సాయ్ యానం జట్టుపైన, తూర్పుగోదావరి జట్టు 25-23, 31-29తో శ్రీకాకుళం జట్టుపైన విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించాయి. ఈస్ట్‌కోస్ రైల్వే జట్టు 25-18,25-21తో సాట్స్ హైదరాబాద్ జట్టుపైన, కృష్ణాజిల్లా జట్టు 18-25తో తొలి సెట్‌లో వెనుకబడినా 25016,15-11తో తరువాత సెట్స్‌లో కిట్స్‌వర్సిటీ జట్టుపై విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాయి.

మసీదు నిర్మాణంలో నేను ఓ కూలీనే..



కోటవీధిలో ముస్లిం పెద్దను సత్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

- ముస్లిం, మత్స్యకార సామాజికవర్గ పెద్దల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి



రంజాన్ మాసం వేళ ముస్లిం పెద్దతో వాసుపల్లి ఆలింగనం

దాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు కోటవీధిలో పుట్టి పెరిగానని, అక్కడి మసీదు నిర్మాణంలో ఇటుక పేర్చినవాడిలో నేనూ ఓ కూలీ నేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 39వ వార్డులో ముస్లిం, మత్స్యకార సామాజిక వర్గ పెద్దల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. స్థానికులు వాసుపల్లిని సాదరంగా స్వాగతించారు. మా మద్దతు మీకేనని మాట ఇచ్చారు. అభివృద్ధి, ప్రజాసేవలో గణేష్‌కుమార్‌కు మించిన వారు దక్షిణంలో లేరని, వాసుపల్లి గెలుపు ప్రజల గెలుపని ముస్లిం, మత్స్యకార సామాజికవర్గ పెద్దలు పేర్కొన్నారు. అనంతరం వాసుపల్లి మీరు చూపిస్తున్న ఆదరణ హృదయంలో దాచుకుంటానన్నారు. పుట్టి పెరిగిన ఊరిలో తనకు ఇంతటి స్థాయినిచ్చిన ప్రజలకు సేవ చేసుకోవడం బాధ్యతగా పేర్కొన్నారు. ఈ రాష్ట్రానికి మరో పాతికేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం అవసరమన్నారు. ఓటమి ఒప్పుకున్న పవన్, మోదీలతో జతకట్టిన చంద్రబాబు చేస్తున్న కుళ్లి రాజకీయాలను మనమంతా తిప్పి కొట్టాలన్నారు. మసీదుతో పాటు ఇంటి అమ్మవార్లను దర్శించుకుని పెద్దల ఆశీసులు తీసుకున్నారు. కార్యక్రమంలో 39వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై దృష్టి సారించాలి



ముఖ్యఅతిథులతో సదస్సు కన్వీనర్లు, అధ్యాపకులు, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మనస్తత్వశాస్త్రం- వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలుపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ముగింపు సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయ అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, విశిష్ట అతిథిగా హాజరైన హైదరాబాద్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్య డి.జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు సంకల్ప బలం, క్రమశిక్షణ, జ్ఞానం, నైపుణ్యాలు పెంచుకోవాలని, దానికి తల్లిదండ్రులు, గురువులపై భక్తి భావం కల్గిఉండడం కీలకమన్నారు. సమాజంలో జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించినపుడే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. మానసిక వికాసానికి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్యోతి, సిబిల్ రత్న, డాక్టర్ హేమ, డాక్టర్ రజిని, డాక్టర్ హదసా, పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, డాక్టర్ పీకే జయలక్ష్మి పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపుపై సదస్సు



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు అంశంపై శనివారం ఒకరోజు అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సదస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమజంలో ప్రత్యేక అవసరం, ప్రాధాన్యత కలిగిన అంశాలపై సదస్సును నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణా ఐవీఎఫ్ క్లీనిక్ వైద్యుడు డాక్టర్ జి.ఎ.రామరాజు మాట్లాడుతూ లింగ గుర్తింపులో జీవ సంబంధమైన అంశాలను వివరించారు. అమెరికాలోని కెంటరీ నగరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డెబొరా నకటోలా లింగ నిర్ధారణ రక్షణ అంశంపై ప్రసంగించారు. కోల్‌కతాలోని కేఎఫ్‌సీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ అనిర్బాన్ మెజందార్ ట్రాన్స్‌జెండర్స్‌కి హార్మోన్‌ల చికిత్సతో మెరుగైన జీవన ప్రమాణాలను అందించడంపై అవగాహన కల్పించారు. ఏయూ న్యాయ కళాశాల విశ్రాంత ఆచార్యుడు ఎస్.నిర్మల మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌కు సమాజం నుంచి ఎదురయ్యే సమస్యలు, వివక్షత చట్టపరమైన రక్షణ, హక్కుల గురించి ప్రసంగించారు. యూనివర్సిటీ ఆఫ్ ఇండోనేషియా ఆచార్యుడు సుల్తానా, హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, రచన ముద్రబోయిన, జి.కోమలి, డాక్టర్ పద్దయ్య, డాక్టర్ సంధ్య దీపిక, తదితరులు ప్రసంగించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ రంగంలో పోటీతత్వం



మాట్లాడుతున్న ఆచార్య కిషోర్‌బాబు

ఏయూ క్యాంపస్: మార్కెటింగ్ విధానాలు, వ్యూహాలు మారుతున్న నేపథ్యంలో కార్పొరేట్ రంగంలో పోటీతత్వం పెరుగుతోందని కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆచార్య కిషోర్‌బాబు అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం జరిగిన మార్కెటింగ్ డైమెన్షన్స్–ఇండస్ట్రీ 4.0 అంశంపై ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో లక్ష్య సాధనకు మార్కెటింగ్ సాధనంగా నిలుస్తుందన్నారు. కంటెంట్ డిజైన్, లాంగ్వేజ్, ఎమోషనల్ ఇంటిలిజెన్స్, బిహేవియర్ స్టడీస్, బ్యాక్ గ్రౌండ్ కాన్సెప్ట్స్, సామాజిక సంబంధాలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రకటనల రూపకల్పన చేయాలని సూచించారు. డిజిటల్, బ్రాండ్ మార్కెటింగ్‌లు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆచార్య కిషోర్‌బాబును విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డ్టార్ బి.సుబ్బయ్య, కె.వి.రమణమూర్తి, విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సుల నాణ్యతకు ప్రాధాన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో అందించే కోర్సుల రూపకల్పన నుంచి నిర్వహణ వరకు ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూర విద్యలో సంస్కరణలు అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సరైన దిశలో చేసే సంస్కరణలు భవిష్యత్తులో మంచి ఫలితాలు అందిస్తాయన్నారు. విద్యా రంగంలో పని చేస్తున్న వారంతా సేవా దృక్పథంతో నడుచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో స్వల్పకాలిక కోర్సుల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. దూర విద్యలో చదివే విద్యార్థులకు సైతం రానున్న కాలంలో ప్లేస్‌మెంట్స్ కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వర రావు మాట్లాడుతూ పరీక్షల్లో ఓఎంఆర్ జవాబు పత్రాలను ప్రవేశ పెడుతున్నామన్నారు. రానున్న కాలంలో ఆన్‌లైన్ కోర్సులకు గణనీయంగా డిమాండ్ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం తమ కేంద్రంలో అందించే అన్ని సేవలకు ఆన్‌లైన్లో చెల్లింపులు జరిపే సదుపాయం కల్పించామన్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ ఎస్‌డీఈని అభివృద్ధి చేసిన విధానం చాలా బాగుందన్నారు. లక్ష మంది విద్యార్థులకు సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ జయరామ్ రచించిన బీఈడీ పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. ఈ సదస్సులో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎస్‌డీఈ అసోసియేట్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, ఏయూ దూరవిద్య స్టడీ సెంటర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తి ప్రదాత



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జె.రవి, తదితరులు

బీచ్ రోడ్డు: భగత్‌సింగ్ కలలుగన్న సామ్యవాద లౌకిక రాజ్యస్థాపన జరగాలంటే యువత మేల్కోవాలని భారత నాస్తిక సమాజం కేంద్రం కమిటీ నాయకుడు జె.రవి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని యువత ప్రశ్నించే గుణం అలవర్చుకోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించి వేస్తుంటే యువత ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. ఇలాగైతే భావితరాల భవిష్యత్తు ఏమౌతుందని ప్రశ్నించుకోవాలన్నారు.

రేపు అయ్యప్పకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమ వారం సుజాతనగర్ లోని పూర్ణ పుష్కళ సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్న ట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం జరుగుతుందన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన 'స్వాతి'



విజేత స్వాతిను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఏవీ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కె.స్వాతి ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. పిడిలైట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో గత వారం హైదరాబాద్‌లో వినూత్న సైన్స్ ప్రాజెక్టులపై ఫెవిక్రీట్ ఆర్ట్ ఇంటిగ్రెటెడ్ ప్రాజెక్ట్ పేరిట పోటీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఈ పోటీలకు లక్ష 30 వేల మంది హాజరు కాగా ఎనిమిది మందిని ఫైనల్ పోటీలకు ఎంపిక చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి స్వాతి మాత్రమే ఎంపిక కావడం విశేషం. ఈ నెల 31న ముంబైలో జరగనున్న ఫైనల్ పోటీలకు స్వాతి హాజరు కానున్నారు. అక్కడ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పిడిలైట్ ఇండస్ట్రీస్ సీఈవో చేతుల మీదుగా స్వాతికి ఫ్లైట్ టిక్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల పీఈటీ కమిటీ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం కె.సంజీవరావు స్వాతిని అభినందించారు.

హోలీ పౌర్ణమి ఏర్పాట్లు పూర్తి

- ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ లక్ష్మీనగేష్
- రేపు పౌర్ణమి ప్రత్యేక పూజలు
- సత్య దేవుని ఆలయానికి పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు



ఘాట్‌రోడ్డులో పెండాల్స్ ఏర్పాట్లు



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యం గల ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో హోలీపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు హోలీ పౌర్ణమి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. భక్తులు సాగరతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి రానున్నారు.

4 గంటల నుంచే పౌర్ణమి పూజలు..

ఆ రోజు వేకువజాము 4 గంటలకు వేదమంత్రాలతో ధ్వజస్తంభ పూజ నిర్వహించనున్నారు. పూజ అనంతరం ధ్వజస్తంభం చుట్టూ పంచ ప్రదక్షిణ, స్వామి తొలి దర్శనం భక్తులకు కల్పించనున్నారు. ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు సత్యనారాయణస్వామిని దర్శించుకోవచ్చు. స్వామి మొదటి, మూడో బ్యాచ్ వ్రతాలు ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు విశేష ప్రత్యేక వ్రతాలు నిర్వహించనున్నారు. రెండో బ్యాచ్ ఉదయం 8.30 గంటలకు సాధారణ వ్రతాలు జరపనున్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులు గంట ముందు ఆలయానికి రావల్సి ఉంది. వ్రతంలో పాల్గొనదలచే భక్తులు రెండు కొబ్బరికాయలు, అరడజన్ అరటిపండ్లు, విడి పువ్వులు తెచ్చుకోవాలి.

వేసవి దృష్ట్యా ప్రత్యేక సౌకర్యాలు

రాఖీ పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాం. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సదుపాయం కల్పించాం. పెండాల్స్ ఏర్పాటు చేశాం. భక్తుల దర్శనార్థం వివిధ ఆలయాల నుంచి సిబ్బందిని ఏర్పాటు చేశాం. వన్‌టౌన్ పోలీసులు బందోబస్త్ నిర్వహించనున్నారు.

– బుద్ధ లక్ష్మీనగేష్, ఈవో, ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయం

ఐవీఎల్ శాస్త్రికి ఘన నివాళి



ఉచిత శిక్షణ శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: నగరంలోని జిల్లా కోర్టు సమీపంలో ఐవీఎల్ శాస్త్రి 97వ జయంతిని శనివారం నిర్వహించారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితికి సంబంధించి ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఇంద్రగంటి రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవీఎల్ శాస్త్రి శాస్త్రీయ సంగీత శిఖరమని పేర్కొన్నారు. సంగీత జనకులం ద్వారా చేసిన శాస్త్రీయ సంగీత సేవలు కొనియాడారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో సంగీత జన కులం స్థాపించి తద్వారా వేలాది మందికి శాస్త్రీయ సంగీతంలో తర్ఫీదునిచ్చిన ఘనత ఇంద్రకంటి వెంకట లక్ష్మణ శాస్త్రికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు మధురంగా సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆకొండి వెంకట్రావు, పి.జగన్‌మోహన్‌రావు, జి.మధుబాబు, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

31న దరఖాస్తులు స్వీకరణ.. : ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సారథ్యంలో ఈ నెల 31న ఉదయం 6 గంటలకు రామ్‌నగర్ దరి రాఘవేంద్రస్వామి మఠంలో ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణా తరగతులకు సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఆ రోజునే పోటీ పరీక్ష కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9440788809 నంబరులో సంప్రదించాలన్నారు.

వైభవంగా గౌర పూర్ణిమ



శ్రీకృష్ణ బలరాములకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గౌర పూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత శ్రీనితాయి గౌరంగ విగ్రహాలకు(శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు) అభిషేకం నిర్వహించారు. పూలతో హోళి జరిపారు. అనంతరం మహా మంగళ హారతి, సంకీర్తన కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. పలువురు ప్రముఖులు పాల్గొని శ్రీకృష్ణ, బలరాములకు పల్లకి సేవ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు జయంతి ఉత్సవాలలో భాగంగా ఈ వేడుకలు నిర్వహించినట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా పండిత సదస్సు



సదస్సు నిర్వహిస్తున్న వేదపండితులు

సింహాచలం: సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం పండిత సదస్సు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వేద పండితులు స్వామివారి వైభవాన్ని కీర్తించారు. అర్చకులు పూజలు నిర్వహించారు. సదస్సులో వేద పండితులు రామాయణం జగన్‌మోహన్‌శర్మ, ముక్కామల సుబ్రహ్మణ్యశర్మ, ఎం.లలిత్‌కుమార్‌శర్మ, మధుర సోమయాజులశర్మ, కిరణ్ కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.